క్లుప్తంగా

వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2024 జనవరి నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణతై విద్యార్హత ఉండాలని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీ://40.80.241.107/ఏపీవలంటీర్20/ఏపీవలంటీర్090420201049 వీటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు వీఎంసీ వార్డు సెక్రటరీస్ స్పెషల్ సెల్ 81859 33187 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్విమ్మర్ తులసీచైతన్యకు అభినందన



విజయవాడస్పోర్ట్స్: ప్రపంచంలోని ఐదు జలసంధులను ఈదిన హెడ్‌కానిస్టేబుల్, అంతర్జాతీయ స్విమ్మర్ ఎం.తులసీచైతన్య సాహసం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. ప్రతిష్టాత్మకమైన ఐదు జల సంధులను ఈదిన చైతన్యను 'టెన్సింగ్ నార్కే నేషనల్ అడ్వెంచర్ అవార్డు'తో ఇటీవల కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సీపీ రాణా ఆయన కార్యాలయంలో తులసీచైతన్యను శుక్రవారం అభినందించారు. గిబ్రల్టర్, పాక్, ఇంగ్లిష్, బొడెన్సీ, కాటలీనా జలసంధులను ఈదిన తులసీచైతన్య పోలీస్ కమిషనరేట్ ఉద్యోగి కావడం గర్వంగా ఉందన్నారు. ఐదు జల సంధులను ఈదిన మొదటి ఇండియన్ పోలీస్‌గా రికార్డు సొంతం చేసుకున్నాడన్నారు. రాష్ట్ర, జిల్లా, విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటడం సంతోషంగా ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆంధ్రా క్రికెట్ సంఘంపై కేసు డిస్మిస్

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలను సవాల్ చేస్తూ పలువురు వేసిన కేసును దేశ అత్యున్నత స్థానం శుక్రవారం తోసిపుచ్చిందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసోసియేషన్ ఎన్నికలపై స్టే విధించాలని కోరుతూ కబడ్డీ క్రీడాకారులు వీర్లంకయ్యతో పాటు పలువురు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. ఫిర్యాదుదారులు ఫిర్యాదులో పేర్కొన్న విషయాలను నిరాధారమైనవిగా న్యాయస్థానం పరిగణలోకి తీసుకుని కేసును డిస్మిస్ చేసిందన్నారు. ఇదే విషయంపై ఫిర్యాదుదారులు ఆరు నెలల క్రితం తొలుత రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారని, ఈ నెల 5వ తేదీన హైకోర్టు ఈ కేసును కొట్టివేసిందని వారు పేర్కొన్నారు.

కేఆర్‌జీ శేషుకుమార్‌కు అభినందన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యాన ఏలూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి 'సాహిత్య సంక్రాంతి సంబరాలు'లో అధ్యాపకుడు, విమర్శకుడు జీసీటీఏ నాయకుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్‌ను ఏపీ సాహిత్య అకాడమీ వారు ప్రశంసాపత్రం, నగదు పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా శుక్రవారం మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ శేషుకుమార్‌ను జీసీటీఏ నాయకులు ఎం.పద్మనాభం, లలితారెడ్డి, పి.శ్రీనివాస్, లైబ్రేరియన్స్ అసోసియేషన్ నాయకులు జి.ఉముంబా, గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్స్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, శ్రీను తదితరులు అభినందించారు.

రేపు శ్రీగోదా రంగనాథ స్వామి కల్యాణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ఆదివారం శ్రీ గోదా రంగనాథ స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు పారాయణ మండలి వ్యవస్థాపక కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

- పలు కళాశాలల్లో వేడుకలు ప్రారంభం
- సందడి చేసిన విద్యార్థులు



కేబీఎన్ కాలేజీలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆ కళాశాల ఉమెన్స్ స్టడీ సెంటర్, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఆ కళాశాల ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో సంక్రాంతికి చాలా ప్రధానమైన స్థానముందన్నారు. భారతీయ జీవనంలో సంక్రాంతి ముడి పడి ఉందన్నారు. రైతులు పండించే పంటలు సంక్రాంతి ముందు చేతికి వస్తాయన్నారు. అలాగే సూర్యుడు దక్షణాయనం నుంచి ఉత్తరాయణానికి మరలుతాడని చెప్పారు. తొలి రోజు ముగ్గుల పోటీలను అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో నిర్వహించారు. అదేవిధంగా గాలిపటాల పోటీలను సైతం సందడిగా జరిపారు. వాటితో పాటుగా మెహందీ, పండి వంటల పోటీల్లోనూ విద్యార్థినులు వారి సత్తా చూపారు. శనివారం సంప్రదాయ వస్త్రధారణ, భోగిపళ్లు, భోగి మంటలు, గంగిరెద్దుల ఆటలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు కరంబీర్‌కౌర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు కాలేజీలో భోగిమంటలను వెలిగిస్తున్న కళాశాల యజమాన్యం



గాలిపటాలతో సందడి చేస్తున్న కళాశాల నిర్వాహకులు

పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో..

పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, పి.లక్ష్మణస్వామి, కోశాధికారి కే వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సంస్కృతీ సంప్రదాయాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గొల్లపూడిలోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో సంస్కృతీ సంప్రదాయాలు వెల్లివిరిశాయి. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించటం, గంగిరెద్దుల విన్యాసాలు, గాలి పటాలు ఎగురవేయటం, భోగి మంటలు, బొమ్మల కొలువు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సంబరాలు అంబరాన్నంటాయి. వీటన్నింటినీ తిలకించిన చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు తాము ఉన్నది పల్లెలోనా.. నగరంలోనా అని ఆశ్చర్యపోయారు. అలాగే వాటిని నిర్వహించిన స్కూలు యాజమాన్యాన్ని, పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

ఆకట్టుకున్న క్లబ్స్ కార్నివాల్

సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్లబ్స్ కార్నివాల్ ఆహూతులను ఆకట్టుకుంది. ఇందులో కుకరీ క్లబ్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ క్లబ్, మీడియా క్లబ్, గార్డెనింగ్ క్లబ్‌లో చిన్నారులు చూపిన ప్రతిభ సందర్శకులను అబ్బురపరిచింది. కార్యక్రమంలో పాఠశాల జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య, స్కూల్ ప్రిన్సిపాల్ వాణి, ఇన్‌చార్జి బాషా, ఏట వాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాచార విశ్లేషణపై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సమాచార విశ్లేషణకు సంబంధించిన కంప్యూటర్ పరిజ్ఞానంపై మరింత పట్టు సాధించాలని టెక్ మోడల్ ఎడ్యుటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఏ పవన్‌కుమార్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ట్యాబ్లు టూల్ – డేటా విజువలైజేషన్' అంశంపై ఐదు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ విస్తృతమైన డేటాను త్వరతగతిన విశ్లేషణ చేయటానికి తద్వారా మంచి ఫలితాలను తీసుకోవటానికి ట్యాబ్లు టూల్ చాలా విశేషంగా ఉపకరిస్తుందన్నారు. కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను వారివారి రంగాల్లో తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ పటమట కరణం బజారుకు చెందిన శతాధిక వృద్ధురాలు బొడ్డనపల్లి వెంకట స్వరాజ్యలక్ష్మి(106) గురువారం కన్నుమూశారు. ఈమె మృతి చెందే రోజు వరకు తన పని చేసుకొనేది అని బంధువులు చెబుతున్నారు. ఈమె భర్త బ్రహ్మానందరావు కరణంగా 25 ఏళ్ల పనిచేశారు. ఆయన 1968వ సంవత్సరంలో మరణించారు. వీరికి ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు సంతానం కలరు.

వైఎస్సార్ సీపీకి మళ్లీ అధికారం ఖాయం

- విజయవాడ ఎంపీ కేశినేని నాని, మేయర్ భాగ్యలక్ష్మి
- కార్మికవాడలో రూ.3.38 కోట్లతో వాటర్ ట్యాంక్ ప్రారంభం



కుళాయిని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, మేయర్ భాగ్యలక్ష్మి, అవినాష్ తదితరులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరిగిందని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని విజయవాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నాయకులు కేశినేని శ్రీనివాస్ అలియాస్(నాని) స్పష్టం చేశారు. ఆటోనగర్‌లో రూ.3.38 కోట్లతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును శుక్రవారం ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ నాని మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. జవహర్ ఆటోనగర్‌కు ఆసియా ఖండంలో గొప్పపేరు ఉందన్నారు. గతంలో ఆటోనగర్ అప్రోచ్ రోడ్డుకు తన ఇంటి ముందు స్థలం రెండు ఎకరాలు బాండ్ లేకుండా ఉచితంగా ఇచ్చానన్నారు. పార్టీలో చేరిన వెంటనే తనకు ఎంపీ సీటు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అవినాష్‌ను ఎమ్మెల్యేగా, ఎంపీగా తనను వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

శరవేగంగా నగరాభివృద్ధి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ నగరాన్ని శరవేగంగా అభివృద్ధి చేసేందుకు గాను రూ.కోట్లాది డబ్బును హెచ్చించామని మేయర్ భాగ్యలక్ష్మి చెప్పారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో నగరం బాగా అభివృద్ధి చెందిందన్నారు. తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు.

గత ప్రభుత్వం నీరు ఇవ్వలేదు..

కార్మికవాడ ఏర్పడి 40 ఏళ్లు అవుతున్నప్పటికీ తాగు నీటికి నోచుకోలేదని.. దీనికి అంతటికి చంద్రబాబు పుణ్యమేనని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇక్కడ ఉన్న అన్ని కార్మిక సంఘాల నాయకత్వంలో ఎంపీ కేశినేని నాని సహకారంతో ఆటోనగర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంపీ నిధులు, ఐలా నిధులతో సుమారు రూ.3.38 కోట్లతో నీటి ట్యాంక్‌ను నిర్మించారన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని 7 నియోజవర్గాలతో పాటు ఎంపీ సీట్‌ను గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ నానిని సన్మానించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఐలా మాజీ చైర్మన్ ఎస్ దుర్గాప్రసాద్, ఓల్డ్ ఐరన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల ప్రసాద్‌రెడ్డి, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, విజయవాడ క్లస్టర్ ఫైనాన్స్ డైరెక్టర్ బాయన బాబూజీ, ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు, డిస్పోజల్ మోటార్స్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌస్‌ఖాన్, గ్యాస్ వెల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్ణ, 11వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పర్వతనేని బాబి తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనం వద్ద విద్యుద్దీకరణ పనులు పూర్తి చేయాలి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



స్మృతివనం వద్ద పనులను పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వరాజ్‌మైదానంలో అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం వద్ద విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేయాలని సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు సిబ్బందిని ఆదేశించారు. అంబేడ్కర్ స్మృతివనం వద్ద జరుగుతున్న విద్యుత్ పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రోడ్డులో అడ్డుగా ఉన్న 33 కేవీ లైన్లను తొలిగించాలన్నారు. తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. . కొత్తగా రిలీజ్ చేసిన హెచ్‌టీ సరీ్వసను చెక్ చేశారు. ఆయన వెంట ఎస్ఈ ఏ.మురళీమోహన్, టౌన్ ఈఈ బి.వి.సుధాకర్, ఏడీఈ పి.శ్రీధర్, ఏఈలు ఉన్నారు.

వివేకానంద బోధనలు అనుసరణీయం



వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్వామి వివేకానంద అందించిన బోధనలు నేటి యువత అనుసరించాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఆ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం ఆ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందకు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ.. సర్వమత సమ్మేళనానికి భారత ప్రతినిధిగా చికాగో వెళ్లిన స్వామి వివేకానందను అమెరికా ప్రజానీకం బ్రహ్మరథం పట్టిందన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా 1984లో ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.భాగ్యకుమార్, పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, అధ్యాపకులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.సాంబశివరావు, డి.పవన్‌కుమార్, వి.శేషగిరిరావు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు కళాశాలలో..

స్వామి వివేకానంద స్ఫూర్తిని నేటి తరం కొనసాగించాలని ప్రముఖ సంస్కృత పండితులు ఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లకార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువత–లక్ష్యాలు అంశంపై సదస్సును నిర్వహించారు. వివేకానంద జీవించిన కాలం తక్కువే అయినా ప్రపంచాన్ని ప్రభావితం చేసిన ఘనత అధికమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అల్లాహ్ దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాంబేకాలనీలోని ఆస్తాన ఎ గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ ఖాజా బాబా ఆశ్రమం 8వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలంటే వైఎస్సార్ కుటుంబానికి అమితమైన ప్రేమ అని అన్నారు. ఆ అల్లాహ్ దీవెనలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలంతా జగనన్న వెంటే నడుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ ఖాజా బాబా ఆశ్రమంలో జరిగే వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, 2024 ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించి జగనన్నకు బహుమతిగా అందిస్తామన్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, బెవర నారాయణ, పొదిగంటి నాగరాజు, షేక్ ఇస్మాయేల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహాయం అభినందనీయం



పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ విజయసారథి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు,

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తాము చదువుకున్న కళాశాలలో సమస్యలను పరిష్కరించడానికి పూర్వ విద్యార్థులు సహాయం చేయడం అభినందనీయమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కళాశాల ఎలక్ట్రికల్ లాబోరేటరీలో అవసరమైన ఫ్లోరింగ్, రంగులు వేయడం, తలుపులు, కిటికీలకు సుమారు 2.15 లక్షల రూపాయలతో రిపేర్లు చేయించారు. పూర్తి అయిన పనులను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. వారు చదువుకున్న కళాశాలకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని పూర్వ విద్యార్థులు భావించి ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రికల్ శాఖాధిపతి భీమా నాయక్, అధ్యాపకులు రాకేష్ బాబు, రిటైర్డ్ అధ్యాపకుడు భానుమూర్తి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎంవీ.బాబు, కార్యదర్శి గోపిచంద్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థులు రామచంద్రరావు, వెంకటేశ్వరరావు, గిరిజా కుమారి, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫ్‌కు సంపూర్ణ మద్దతు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్



ఆసిఫ్‌కు సన్మానిస్తున్న డాక్టర్ మారేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్‌కు బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్ అన్నారు. విజయవాడ పంజాసెంటర్‌లోని ఆసిఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మారేష్ ఆసిఫ్‌కు మద్దతు పలికి రానున్న ఎన్నికల్లో గెలిపించుకుంటామని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మనసులను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గెలుచుకున్నారన్నారు. ఆసిఫ్‌కు సీఎం కీలక బాధ్యతలు అప్పగించారని చెప్పారు. ఆసిఫ్ పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. సామాన్యుడైన వ్యక్తిని రాష్ట్ర ముఖ్యమంత్రి పశ్చిమ నియోజకవర్గానికి కేటాయించారని, బీసీలంతా ఆయనను గెలిపించుకోవాలన్నారు. నియోజకవర్గంలో పర్యటించి గెలుపించుకుంటామన్నారు. అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో బీసీ గర్జన నిర్వహిస్తామన్నారు.

సామాజిక న్యాయం చేస్తున్న జగన్

దేశంలో సామాజిక న్యాయానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆసిఫ్ అన్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ.. బీసీలకు సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. బీసీలంతా తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వాలు బీసీలకు వెన్నుపోటు పొడిస్తే' సీఎం జగన్ బీసీలకు వెన్నుముకగా నిలిచారని చెప్పారు. నగరంలోని మూడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడిస్తామన్నారు. కార్పొరేటర్ అర్షద్, పార్టీ నేతలు మండల శ్రీను, బాషీ తదితరులు ఉన్నారు.

వీఎంసీలో మరో ఐదు ప్రత్యేక కమిటీల ఏర్పాటు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ సెక్రటరీ సెల్‌లో సెక్రటరీ వసంతలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీకి మరో ఐదు ప్రత్యేక కమిటీ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యింది. పారిశుద్ధ్యం, ఆరోగ్యం ప్రత్యేక కమిటీకి చైర్‌పర్సన్‌గా కార్పొరేటర్ మొహమ్మద్ షహీనా సుల్తానా, డెప్యూటీ చైర్‌పర్సన్‌గా కార్పొరేటర్ బలసాని మణిమ్మను నియమించారు. నగర సమగ్రాభివృద్ధి ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, డెప్యూటీ చైర్మన్‌గా కార్పొరేటర్ కుక్కల అనిత, ఆర్థిక, ఆడిట్ ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్‌గా 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మల కుమారి, వైస్ చైర్‌పర్సన్‌గా 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్యను నియమించారు. మహిళాభ్యుదయ ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్‌గా 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైస్ చైర్‌పర్సన్‌గా 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, విద్యా, సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేక కమిటీకి 32వ డివిజన్ చైర్మన్‌గా చన్నగిరి రామ్మోహనరావు, వైస్ చైర్మన్‌గా 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావును నియమించారు.

సుస్వరాల సంగీత దర్శకుడు సత్యం



విజయవాడకల్చరల్: సుస్వరాల సంగీత దర్శకుడు చెళ్లపిళ్ల సత్యం అని డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో, జీఎస్ మెలోడీస్, మహేష్ కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ సంగీత దర్శకుడు, సినిమా నిర్మాత సత్యం జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ సత్యం అనేక విజయవంతమైన చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారన్నారు. విశ్వమాతా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. పండిత కుటుంబానికి చెందిన సత్యం తెలుగు, కన్నడ, మలయాళం తదితర భాషల సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారని చెప్పారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసాన్నా రామన్, మల్లంపల్లి రాజా, గొట్టిపాటి రామారావు, రాజకిషోర్, సుధారాణి, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి వివేకానంద

తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డా.నందమూరి లక్ష్మీపార్వతి, కొమ్మినేని శ్రీనివాసరావు



పురస్కార గ్రహీతలతో నందమూరి లక్ష్మీపార్వతి, శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన బోధనలతో ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి స్వామి వివేకానంద అని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డా.నందమూరి లక్ష్మీపార్వతి, మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని హోటల్ ఐలాపురం కన్వెన్షన్ హాలులో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు జరిగాయి. తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వేడుకల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ వివేకానంద బోధనలతో యువతను జాగృతం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. తన బోధనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచారని తెలిపారు.

మాస్టర్ మోటివేటర్ బ్రదర్ షఫీ మాట్లాడుతూ యువత తమలో దాగివున్న నైపుణ్యాలను గుర్తెరిగి తద్వారా సామాజిక చైతన్యానికి, దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 25 మందికి సంఘ మిత్ర జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, అద్దంకి రాజాయోనా, మీడియా అకాడమీ రాష్ట్ర కార్యదర్శి యం.బాలగంగాధర్ తిలక్, పుడమి సాహితీవేదిక అధ్యక్షుడు డా.చిలుముల బాల్‌రెడ్డి, సాహితీవేత్త కొల్లి రమావతి, డ్రీమ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మేదర సురేష్‌కుమార్ పాల్గొన్నారు.